వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక
TE TL/26/A2635



## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం.

- రాయిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

3




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:92 | 14-08-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల 3/-

## ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

- సుప్రీంకోర్టులో మరోసారి విచారణకు రంగం సిద్ధం
- గతంలో వాదనలు విన్న న్యాయమూర్తులకు పదవీ విరమణ
- కొత్త ధర్మాసనం ముందు పూర్తిస్థాయి వాదనలు
- పాత వాదనలను పరిగణనలోకి తీసుకోలేమన్న సీజేఐ

2



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

- కొత్త కార్డుల మోడల్ విడుదల
- ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు పంపిణీ
- భద్రత కోసం హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్
- కార్డుపై కుటుంబ వివరాలు, చిరునామా

2






# గోడ దూకితే గోసకచ్చే..

### కాంగ్రెస్‌లో చేరి.. ఇటు అటు కాకుండా ఫిరాయింపు ఎమ్మెల్యేలు

- బీఆర్ఎస్‌లో హోదా పోయి.. కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కరువు
- నిధులు, అభివృద్ధి పనులపై పెరుగుతున్న అసంతృప్తి
- దానం నాగేందర్, పోచారం వ్యాఖ్యలతో బహిర్గతమైన ఆవేదన
- పటాన్‌చెరు పరిణామాలతో మరింత ఆసక్తి
- రాజకీయ భవిష్యత్తుపై అయోమయంలో పది మంది ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, ఆగస్టు 13:**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఇప్పుడు ఇబ్బందికరంగా మారిందన్న చర్చ సాగుతోంది. అధికార పార్టీకి అండగా నిలిస్తే నియోజకవర్గాలకు పెద్దఎత్తున నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని భావించి పార్టీ మారిన వారికి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ ఆవేదనను వెల్లడిస్తుండగా.. మరికొందరు అంతర్గతంగా అసహనంతో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మిగతా 2వ పేజీలో..



## మైనారిటీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్ళి వోట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 13 :**

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల

మిగతా 2వ పేజీలో..

## ప్రత్యేక దృష్టితో కూకట్‌పల్లి అభివృద్ధి

- మంత్రి శ్రీధర్‌బాబుకు సీఎం ఆదేశాలు
- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు శంకుస్థాపన
- 22-ఎ విషయంలో మీ భూములు పోకుండా చూస్తా
- అండగా అభివృద్ధి చేసి చూపిస్తా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2





రామాలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి
- విస్తా కాంప్లెక్సు ఖాళీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి
- అధికారులతో కలిసి రామాలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవస్థానంఈవో

4

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:**

రాష్ట్రంలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు నాణెనికి ఇరువైపులా ఉన్నటువంటివని పేర్కొన్నారు. యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు ఎకరాలకుపైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 2వ పేజీలో..



## నాడు ఉపన్యాసాలు.. నేడు భూ అమ్మకాలు

- వేలం వెర్రిగా సర్కారు భూముల అమ్మకాలు
- నాడు కోర్టుకు వెళ్లి నేడు అడ్డగోలుగా అమ్ముకుంటావా?
- రాయదుర్గం హెరిటేజ్ భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎంకు హరీష్ రావు లేఖ

2



**హైదరాబాద్, ఆగస్టు 13 :**

రాష్ట్రంలో వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా అంటూ ప్రశ్నించారు. ఈమేరకు సీఎంకు ఓ లేఖ రాశారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు నేడు ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని అని అన్నారు. జీవో ఎంఎస్ నెం.4 ద్వారా రాయదుర్గ పన్మక్త గ్రామంలోని సర్వే నం. 83ను హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేయడం ఏమిటని నిలదీశారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు.

మిగతా 2వ పేజీలో..



## అశ్వరావుపల్లి రిజర్వాయర్ నీటి విడుదల


- చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం: శ్రీహరి

**జనగామ ఆగస్టు 13(డిడి 9 వార్త) బ్యూరో**

వర్షాభావ పరిస్థితుల్లో రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి గురువారం రైతులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు.

మిగతా 5వ పేజీలో..

# నాడు ఉపన్యాసాలు.. నేడు భూ అమ్మకాలు



**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపక్షంలో ఉండగా ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటనా అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబరులో గతంలో 6.2 ఎకరాలు ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని, ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయంటూ భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం భూమిని అమ్మడానికి ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అన్న హామీ ఏమైందని అడిగారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా థర్డ్ పార్టీ ఇంటరెస్ట్ సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఈనెల 17, 21 తేదీల్లో జరపనున్న వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాక ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని, లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని హరీశ్ రావు హెచ్చరించారు.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**హైదరాబాద్, ఆగస్టు 13 :**

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో శనివారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దిన వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అందరూ సమన్వయంతో పనిచేయాలంటూ శాఖల వారీగా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, బ్యారికేడింగ్, గ్యాలరీలు, అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రొటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతోపాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు వచ్చే ప్రతి వాహనంలో ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కాగా, వేగవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, చీఫ్ ఇంజనీర్ రాధాకిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయరామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో పోటీ

**మొదటిపేజీ తరువాయి**



ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాక మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానన్నారు. మరోవైపు రింగ్ రోడ్డు, ఫార్ములాఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# మైనారిటీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**మొదటిపేజీ తరువాయి**

రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో వోట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి వోటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల వోటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక దృష్టితో కూకట్‌పల్లి అభివృద్ధి

**కూకట్‌పల్లి, ఆగస్టు 13 :**

ఆనాడు తాను పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించారు.. అయితే ప్రతిపక్షంలో ఉన్నందున మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడు కూకట్‌పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందంటూ మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశిస్తున్నానన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనను, ఈ తమ్ముడి రెండేళ్ల తమ పాలనను బేరీజు వేసుకోండని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని, ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని, ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడమేగాక ఆ బస్సులకు యజమానులను చేశామని, స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో కడుపులో విషం పెట్టుకుని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా తాము వెనక్కి తగ్గలేదన్నారు. ఆడ బిడ్డలు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లిస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు శ్రీకారం చుట్టిందని, మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన అన్నారు. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని, 22ఏ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది అని హామీ ఇచ్చారు. ఈ విషయంలో మీకు ఆందోళన వద్దని, సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది.. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని చెప్పారు. కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరవు రావాలని క్షుద్ర పూజలు చేశారని, అయినా దేవుడు మన వైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు.. మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉంది అని సీఎం రేవంత్ చెప్పారు. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా అని మరోమారు హామీ ఇచ్చారు.

**వచ్చే బోనాలు ఇందిరమ్మ టవర్స్ నుంచే..**

**– రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన జరిగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమీషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమీషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా రూ.200 కోట్ల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహా నగరంలో పెద్దపెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని అంటూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని, దీనికి సంబంధించి ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని మంత్రి చెప్పారు. ఎలాంటి లాలూచీలు లేకుండా మంత్రులు సహా ఎవరి సిఫారసులు లేకుండా అందరి ముందు లక్కీ డిప్ తీసి పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామన్నారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలు అందిస్తాం కనుక వారు దగ్గరుండి కాంట్రాక్టర్‌తో తమ ఇళ్లను నాణ్యతతో కట్టించుకోవచ్చని సూచించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నరేళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని, అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదన్నారు. అంతేగాక పిట్ట కథలు చెబుతూ పేదలను, పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఎమ్మెల్యేలు తమ దృష్టికి తెచ్చారని, అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంచలనం రేపిన ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీం కోర్టులో మళ్లీ మొదటి దశకు చేరుకుంది. గతంలో ఈ కేసుపై సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే ఆ బెంచ్‌లోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో, న్యాయ నిబంధనల ప్రకారం కొత్త ధర్మాసనం ముందు కేసును తిరిగి విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**కొత్త ధర్మాసనం ముందుకు..**

పదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గతంలోనే విస్తృతంగా వాదనలు జరిగాయి. అయితే వాదనలు విన్న న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో విచారణ ప్రక్రియ పూర్తికాకుండానే నిలిచిపోయింది. కేసుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఈ వ్యవహారం సీజేఐ ముందుకు రావడంతో పాత వాదనలను కొనసాగించే అవకాశం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**మొదటి నుంచే వాదనలు..**

కొత్త బెంచ్ ఏర్పాటైన తర్వాత పిటిషనర్లు, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలను మరోసారి వినిపించాల్సి ఉంటుంది. గతంలో సమర్పించిన వాదనలు, న్యాయపరమైన అంశాలను కొత్త ధర్మాసనం స్వయంగా పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో కేసు విచారణ మరోసారి పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 13:**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు లబ్ధిదారులకు కొత్త కార్డులను అందించనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు నమూనాను విడుదల చేసింది. ఆధునిక రూపకల్పనతో రూపొందించిన కార్డులో భద్రతతో పాటు కుటుంబానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పొందుపరిచారు.

**కార్డుపై కీలక వివరాలు**

స్మార్ట్ రేషన్ కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ఉంటాయి. రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, రేషన్ షాపు నంబర్ వంటి వివరాలను ముద్రించారు.

**వెనుక భాగంలో హోలోగ్రామ్**

కార్డు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వెనుక భాగంలో ప్రత్యేక హోలోగ్రామ్ ఏర్పాటు చేశారు. తక్షణ సమాచారాన్ని పొందేందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అందుబాటులో ఉంచారు.

**చిరునామా వివరాలు**

లబ్ధిదారుడి గ్రామం, ప్రాంతం, మండలం, జిల్లా, పూర్తి చిరునామా వివరాలను కార్డులో పొందుపరిచారు. దీంతో కుటుంబ వివరాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

**పారదర్శకతకు ప్రాధాన్యం**

కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ సాంకేతికతను వినియోగించడం ద్వారా లబ్ధిదారులకు సేవలను వేగంగా అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

# గోడ దూకితే గోసకచ్చే..!

**మొదటిపేజీ తరువాయి**

**అటు పాత పార్టీ.. ఇటు కొత్త గుర్తింపు**

ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితిని పార్టీ మార్పుపై నెలకొన్న చట్టపరమైన పరిణామాలు మరింత సంక్లిష్టం చేశాయి. వీరు కాంగ్రెస్‌లో చేరినట్లు స్పీకర్ అధికారికంగా గుర్తించని నేపథ్యంలో అటు బీఆర్ఎస్‌లో పాత హోదాను కొనసాగించలేక.. ఇటు కాంగ్రెస్‌లో పూర్తిస్థాయి రాజకీయ గుర్తింపు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ చట్టపరమైన, రాజకీయ వేదికలపై తమ పార్టీ మార్పును సమర్థించుకోవాల్సిన పరిస్థితి కూడా వారికి ఇబ్బందిగా మారిందన్న చర్చ సాగుతోంది.

**నిధుల కోసం ఎదురుచూపులు**

కాంగ్రెస్‌లో చేరిన సమయంలో నియోజకవర్గాల అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తవుతాయని పలువురు ఎమ్మెల్యేలు ఆశించారు. అయితే ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదన్న అసంతృప్తి కనిపిస్తోంది. చిన్న చిన్న అభివృద్ధి పనుల కోసం కూడా మంత్రులు, అధికారులను సంప్రదించాల్సి వస్తోందని, తమ విజ్ఞప్తులకు తగిన స్పందన లభించడం లేదని కొందరు ఎమ్మెల్యేలు అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**దానం, పోచారం వ్యాఖ్యలతో కలకలం**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన పనులు కూడా పూర్తిగా అమలు కావడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. దానం నాగేందర్ వైఖరిలోనూ మార్పు కనిపిస్తోందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచుతోంది.

**పటాన్‌చెరు దారి.. మిగతావారి ఆలోచన**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారన్న ప్రచారం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గం బీఆర్ఎస్ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీంతో ఆయన ఇప్పటికే తన రాజకీయ భవిష్యత్తుపై ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. మరోవైపు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాశ్ గౌడ్ తదితరుల పరిస్థితిపైనా చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ అనుచరులు, స్థానిక నాయకుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్‌లోనూ పూర్తి ఆమోదం కరువు**

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మరో సమస్య స్థానిక కాంగ్రెస్ రాజకీయాలు. కాంగ్రెస్‌లో చేరినా పాత కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వీరిని పూర్తిగా తమ నాయకులుగా అంగీకరించలేదన్న వాదన ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో పాత, కొత్త వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయంగా పూర్తి స్థాయి స్వేచ్ఛ, ప్రాధాన్యత లభించడం లేదన్న భావన ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో పెరుగుతున్నట్లు సమాచారం.

**గులాబీ గూటివైపు చూపులా?**

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు కాంగ్రెస్‌లో పూర్తి స్థాయి గుర్తింపు లేకపోవడం.. మరోవైపు బీఆర్ఎస్‌లో గతంలో ఉన్న హోదా, కేడర్‌పై పట్టు కోల్పోవడం వారిని సందిగ్ధంలోకి నెట్టినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు.. గూడెం మహిపాల్‌రెడ్డి వైఖరి.. ఇతర ఎమ్మెల్యేల నియోజకవర్గ సమస్యలు కలిసి ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి.


## మాజీ సర్పంచ్ పాయం కామరాజు దశదిన కర్మలకు హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం, విజయనగరం గ్రామ పంచాయతీ పరిధిలోని తిర్లాపురం గ్రామ మాజీ సర్పంచ్, ప్రస్తుత కాంగ్రెస్ సర్పంచ్ పాయం చిట్టెమ్మ భర్త పాయం కామరాజు దశదిన కర్మల కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా పాయం కామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల మరియు టౌన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాలునికి మేమున్నాం టీం చేయూత



**చర్ల, ఆగస్టు 13 (డిడి 9 వార్త )**

చర్ల మండల కేంద్రంలో మీకోసం మేమున్నాం సంస్థ కార్యాలయంలో గురువారం నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి కార్యవర్గ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. చర్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన గగనం రాజు యొక్క కుమారుడు గగనం మహేష్ (10) కు అతిచిన్న వయస్సు లోనే కిడ్నీ ఆపరేషన్ జరిగింది. తరువాత దాని మూలంగా తలెత్తే ఆరోగ్య సమస్యల వలన ఏర్పడే యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరికి ఆర్థిక సహాయం అందజేయాలనే ఆలోచనతో మీకోసం మేమున్నాం టీం తరపున ఫండ్ రైజింగ్ పోస్టు ద్వారా సేకరించిన 10 వేల రూపాయలను గురువారం ఉదయం 11 గంటలకు చర్ల లోని మీకోసం మేమున్నాం కార్యాలయంలో సంస్థ కార్యవర్గ సభ్యులు శేశెట్టి సాంబశివరావు చేతుల మీదుగా వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ ఇటువంటి అనుకోని కష్టాలు ఎదురైనప్పుడే పేదవారి జీవితాలు కకలవికలమై పోతాయని, అటువంటి సందర్భంలో మనం అందించే చిరు సహాయం వారికి ఎంతో ఊరటగా ఉంటుందనన్నారు. ఈ కార్యక్రమంలో పూనెం గౌతమి, కవ్వాల రాము, ముసలి సతీష్, దొడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చదువులో శభాష్.. సేవలో నవీన్ ఆదర్శం..



**ఆగస్టు 13 డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పూర్వ విద్యార్థినులను గ్రామానికి చెందిన చేలే నవీన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ఆదిలక్ష్మి విద్యార్థినులను అభినందించారు. తన తల్లి జ్ఞాపకార్థం సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలి చేతుల మీదుగా విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేయించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ ఆకాంక్షించారు. సొంత గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో నవీన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆదివాసీ నవనిర్మాణ సేన నేత కొర్సా నర్సింహమూర్తి, న్యాయవాది నాగరాజు అన్నారు. తల్లిదండ్రులు లేకపోయినా స్వశక్తితో ఎదుగుతూ గ్రామానికి సేవ చేయాలనే లక్ష్యంతో నవీన్ ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సర్పంచ్, విద్యార్థుల చేత పండ్ల మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చేలే సుజాత, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం టు వాజేడు రహదారి నేషనల్ హైవేగా మార్చాలి

- **తక్షణమే నిర్మాణం చేపట్టాలి**
- **దుమ్ముగూడెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు డిమాండ్**

**ఆగస్టు 13 డిడి 9 వార్త దుమ్ముగూడెం**



భద్రాచలం నుండి వాజేడు వరకు తక్షణమే నిర్మాణ పనులు చేపట్టి నేషనల్ హైవే గా మార్చాలని గురువారం నాడు సీతారాంపురం గ్రామంలో జరిగిన టువంటి తెలుగుదేశం పార్టీ మీటింగ్ లో కొమరం దామోదర్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుండి వాజేడు వరకు ఉన్న రహదారికి మోక్షం ఎప్పుడు లభిస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గతంలో ఈ రోడ్డు ప్రయాణం బాగుండేదని కానీ ఈ మధ్యకాలంలో ఇసుక లారీల బీభత్సం వలన రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందని ఈ గుంతల కారణంగా ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోయానని దీనివల్ల ఎన్నో కుటుంబాలు మృత్యుగోస పడ్డాయని అయినా ప్రజాప్రతినిధులకు గాని ప్రభుత్వానికి గాని ప్రజల విజ్ఞప్తులు రాస్తారోకలు బందులు నిరసనలను చేసిన చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్టుగా ఉందని అన్నారు. ఒకపక్క గోదావరి పుష్కరాలు సమయం కూడా దగ్గరగా ఉండడంతో కూడా ప్రభుత్వానికి తెలిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ముఖ్యంగా ఈ లారీల వలన పాత కల్వర్టులు బ్రిడ్జిలు కుంగుబాటుకు గురై శిథిల వ్యవస్థకు చేరిన ఈ ప్రజా ప్రతినిధులకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. తక్షణమే పాత కల్వర్టులు బ్రిడ్జిలను ఎత్తు పెంచుతూ నిర్మాణాలను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తక్షణమే నేషనల్ హైవేగా మారుస్తూ రోడ్డు నిర్మాణ పనులను పటిష్టంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెల్లా వేణు కొడాలి సుబ్బారావు కొల్లి గోవిందు క్రాప కిషోర్ తదిరదులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

- **రాయిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**



పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటిని అందించేందుకు కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం రాయిగూడెం గ్రామానికి చెందిన మడకం సారమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన మడకం సారమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుపై భరోసా కల్పించే సొంత చిరునామా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో మేలు చేస్తోందన్నారు. పినపాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా రావాల్సిన బిల్లులు సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేయడంతో పాటు, మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు తమ సొంతింటిలో సంతోషంగా గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాయిగూడెంలో మడకం సారమ్మ కుటుంబం నూతన ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, పేద కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతున్న ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహ పునఃస్థాపనకు అనుమతికి వినతి..

- **వినతి పత్రాన్ని అందజేసిన అంబేద్కర్ యువజన కమిటీ నాయుకులు.**

**అశ్వాపురం.ఆగస్టు 13 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండల కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం అత్యంత విచారకరమని, ఇది దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన ప్రదేశంలోనే విగ్రహాన్ని తిరిగి పూర్తి గౌరవ ప్రతిపత్తులతో పునఃస్థాపించడానికి తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డి.వేణుగోపాల్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని అక్రమంగా తొలగించి నెలలు గడుస్తున్నా.. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడం శోచనీయమన్నారు. అంబేద్కర్ విగ్రహం దళిత, బహుజనుల ఆత్మగౌరవానికి మరియు సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. విగ్రహ తొలగింపును నిరసిస్తూ.. గతంలో శాంతియుతంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టామని ప్రజల మనోభావాలను మరియు సెంటిమెంట్‌ను గౌరవించి జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. విగ్రహ పునఃస్థాపనకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ నిబంధనలను, అనుమతులను పాటించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అధికారులు ఇకనైనా ఆలస్యం చేయకుండా సానుకూల నిర్ణయం తీసుకుని, సమస్య త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్... ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి చట్టపరంగా, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గద్దల నాగేశ్వర రావు, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు గద్దల రామకృష్ణ, మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాలవ శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు అడిగి తెలుసుకున్న ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా, మణుగూరు సింగరేణి.విధి నిర్వహణకు సంబంధించిన పని ముట్లతో పాటు రక్షణకు తగిన పరికరాలను సకాలంలో కార్మికులకు అందించడం ద్వారా నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిక మించడమే కాకుండా ప్రమాదాలు జరుగకుండా అరికట్టవచ్చని ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవ చూపాలని ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 2 డోజర్ విభాగాన్ని ఆయన సందర్శించారు. విధి నిర్వహణకు లో కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెస్ట్ షెల్టర్ ఏర్పాటు చేసినప్పటికీ అందులో కార్మికులకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఎలుకుల బెడద తీవ్రంగా ఉందని కార్మికుల వస్తువులను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయని కబోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. డైనింగ్ హాల్, ఫ్లోరింగ్ సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మూత్రశాలలు అందుబాటులో లేకపోవడం వల్ల సుమారు 200 మీటర్లకు పైగా మల మూత్ర విసర్జనకు నడవవలసి వస్తుందని సమయం వృధా అవుతుందని అందుబాటులో మల మూత్రశాలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెచ్.ఈ.యం.యం కేటగిరి పదోన్నతులకు యాక్టింగ్ అర్హత సాధించినప్పటికీ నేటి వరకు ఆ ఖాళీలను భర్తీ చేయలేదని త్వరితగతిన భర్తీ చేపించాలని వారు తెలిపారు. వాటితో పాటు మరికొన్ని సమస్యలను వారు ప్రస్తావించగా సంబంధిత అధికారులు దృష్టికి కార్మికులు తెలిపిన సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు చిరుత వెంకటేశ్వర్లు, గూగుల్ రమేష్ నాయక్, పడ్డం శ్రీనివాస్, సతీష్ కుమార్, శ్రీనివాస్, సత్రాజు, సర్వేశ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం

**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి మరియు నూతన కేటాయింపులపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హౌసింగ్ శాఖ అధికారులను పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, సమస్యల పరిష్కారం, నిధుల విడుదల వంటి అంశాలపై సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. మొదటి విడతలో పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలకు మంజూరైన 4,500 ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయో మండలాల వారీగా వివరాలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే బేస్‌మెంట్, రూఫ్ లెవల్, పూర్తిస్థాయి నిర్మాణ దశకు చేరుకున్న ఇళ్ల సంఖ్యను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై కూడా ఆయన ఆరా తీశారు. నియోజకవర్గానికి మంజూరైన మొత్తం ఇళ్ల సంఖ్యతో పాటు ప్రతి మండలానికి కేటాయించిన వివరాలను సమర్పించాలని చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు గుర్తించిన కుటుంబాల సమగ్ర నివేదిక వెల్లడించాలని ఆదేశించారు.అర్హత కలిగిన ఒక్క పేద కుటుంబం కూడా మిగిలిపోకుండా క్షేత్రస్థాయి సర్వే పూర్తిగా జరిగిందా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే స్థలం, పట్టా,భూ సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల వివరాలు మండలాల వారీగా ఇవ్వాలని, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఆయన కోరారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల సమస్యలు ఏమిటి, వారికి సహాయం అందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనే అంశాలపై కూడా సమీక్షలో చర్చ జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో అందుతోందా లేదా, ఏమైనా పెండింగ్ చెల్లింపులు ఉన్నాయా అనే విషయాన్ని కూడా పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎస్టీ కోటా కింద అదనంగా మంజూరైన 1,000 ఇళ్ల నిర్మాణ



పురోగతిపై కూడా ఆయన వివరాలు అడిగారు. నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల కొరత లేదా ఇతర స్థానిక సమస్యల కారణంగా ఎక్కడైనా ఆలస్యం జరుగుతోందా అనే అంశాన్ని కూడా స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి హౌసింగ్ శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ నిజమైన పేదలకు మాత్రమే ఇళ్లు అందేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన సూచించారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి నివేదికను ప్రతి వారం క్యాంప్ కార్యాలయానికి సమర్పించాలని కూడా ఆయన స్పష్టం చేశారు. పినపాక నియోజకవర్గంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ఇంకా ఎన్ని ఇళ్లు అవసరమో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబానికి కేవలం ఒక పథకం మాత్రమే కాదు, అది వారి సొంతింటి కల. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి. మంజూరైన ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

# మణుగూరు పట్టణంలో అందుబాటులోకి రానున్న రాపిడో సేవలు..

**ప్రయాణికులకు సౌకర్యం, యువతకు ఉపాధి అవకాశం.**

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**

మణుగూరు పట్టణంలో రాపిడో సేవలు అందుబాటులోకి రావడం ప్రయాణికులకు సౌకర్యంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను అందించే కొత్త మార్గంగా మారనుంది. ఇకపై రాపిడో యాప్ ద్వారా బైక్, ఆటో, క్యాబ్ రైడ్లను బుక్ చేసుకునే అవకాశం స్థానికులకు లభించనుంది. మణుగూరు మున్సిపాలిటీ జనాభా 2011 జనగణన ప్రకారం 32,091 మంది కాగా, ప్రభుత్వ మున్సిపల్ ప్రొఫైల్‌లో ప్రస్తుత అంచనా జనాభా సుమారు 41,519గా నమోదైంది. ఈ స్థాయిలో జనాభా ఉన్న పట్టణంలో రోజువారీ ప్రయాణ అవసరాలు, కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మార్కెట్లు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి యాప్ ఆధారిత రవాణా సేవలు ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

**ప్రయాణికులకు మరింత సౌకర్యం**

ఇప్పటివరకు ఆటో లేదా ఇతర రవాణా




వాహనాల కోసం రోడ్డు మీద వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. రాపిడో యాప్ ద్వారా అందుబాటులో ఉన్న రైడ్‌ను ఎంపిక చేసుకుని పికప్ ప్రదేశం, గమ్యస్థానం నమోదు చేసి బుక్ చేసుకోవచ్చు. రాపిడో అధికారిక సమాచారం ప్రకారం బైక్, ఆటో, క్యాబ్ వంటి రైడ్ ఆప్షన్లు యాప్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రత్యేకంగా తక్కువ దూర ప్రయాణాలకు బైక్ రైడ్, కుటుంబ సభ్యులు లేదా ఎక్కువ మంది ప్రయాణించే సందర్భాల్లో ఆటో, క్యాబ్ సేవలు ప్రజలకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**యువతకు పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశం**

రాపిడో సేవల మరో ముఖ్యమైన ప్రయోజనం స్థానిక యువతకు పార్ట్‌టైమ్ లేదా ఫుల్‌టైమ్ ఆదాయ మార్గం లభించే అవకాశం. సొంత బైక్, ఆటో లేదా ఇతర అర్హత కలిగిన వాహనం ఉన్న యువత తమ ఖాళీ సమయాన్ని వినియోగించుకుని రైడ్ల ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.ఉద్యోగం చేస్తున్న యువత సైతం తమ పని సమయానికి అనుగుణంగా పార్ట్‌టైమ్‌గా ఈ సేవలో పని చేయవచ్చు. అయితే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు, బీమా, హెల్మెట్ తదితర అవసరమైన నిబంధనలు తప్పనిసరిగా పాటించడంతో పాటు, రాపిడోలో డ్రైవర్/క్యాప్టెన్‌గా చేరేందుకు సంస్థ నిర్దేశించిన అర్హతలు, స్థానిక రవాణా నిబంధనలు పాటించాలి.

**భద్రతకు తొలి ప్రాధాన్యం**

రాపిడో సేవలు వినియోగించే ప్రయాణికులు, రైడర్లు హెల్మెట్, ట్రాఫిక్ నిబంధనలు, వేగ పరిమితులు వంటి భద్రతా అంశాలను తప్పనిసరిగా పాటించాలి. ముఖ్యంగా బైక్ రైడ్లలో ప్రయాణికుడితో పాటు డ్రైవర్ భద్రత కూడా అత్యంత ముఖ్యమైన అంశం.

**మణుగూరుకు కొత్త రవాణా అవకాశమా?**

మణుగూరు వంటి పారిశ్రామిక పట్టణంలో సింగరేణి, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిత్యావసరం. ఇలాంటి ప్రాంతంలో యాప్ ఆధారిత రవాణా సేవ అందుబాటులోకి రావడం ప్రజలకు మరో ప్రయాణ ఎంపికను అందిస్తుంది. అయితే రాపిడో సేవలు మణుగూరులో ఎంతవరకు విజయవంతమవుతాయనేది ప్రజల వినియోగం, డ్రైవర్ల లభ్యత, రైడ్‌ల సంఖ్య, ధరలు, సర్వీస్ పరిధి, సమయపాలన వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రారంభ దశలో ప్రజల స్పందనను బట్టి సేవలు మరింత విస్తరించే అవకాశం ఉంది.మణుగూరులో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ సేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు, స్థానిక యువత కూడా నిబంధనలను పాటిస్తూ ఉపాధి అవకాశంగా వినియోగించుకుంటే పట్టణ రవాణా వ్యవస్థకు, యువత ఆర్థిక స్వావలంబనకు ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

# కళాశాల పరిశుభ్రత విద్యార్థుల బాధ్యత

**నవచైతన్య యువజన సంఘం.**

**గుండాల ఆగస్టు 13 (డిడి9 వార్త).**

విద్యార్థులు తమ కళాశాలతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని నవచైతన్య యువజన సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో నిర్వహించిన "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమంలో భాగంగా నవచైతన్య యువజన సంఘం ప్రతినిధులు విద్యార్థులతో కలిసి కళాశాల పరిసరాలను



శుభ్రపరిచారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, ఆహ్లాదకరమైన విద్యాభ్యాసానికి ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు విద్యార్థులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కళాశాలలో నాటిన మొక్కల సంరక్షణ కోసం గ్రీన్ వాలంటీర్లను నియమించి, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడంతో పాటు వాటిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, యువత నాయకులు వినయ్, సంతోష్, వినయ్, సతీష్, ఆజాద్, కళాశాల అధ్యాపకులు రఘుచారి తదితరులు పాల్గొన్నారు.

# బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి..

- **పినపాక ఎమ్మెల్యే, వైల్డ్ లైఫ్ బోర్డ్ మెంబర్ పాయం వెంకటేశ్వర్లుకు జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ వినతి.**

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**

బూర్గంపాడు మండలం లో అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ కరెంటు ఉచ్చులో మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (FBO) బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.విధి నిర్వహణలో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన బానోత్ నవీన్ అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన కరెంటు ఉచ్చుకు గురై మృతి చెందారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు



పునరావృతం కాకుండా అటవీ సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు టి. శోభన్, పి. ఎర్రయ్య, జి. బాబురావు, బి. వెంకన్న, నరేష్, హతిరామ్, శరన్, మదన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- **భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి**
- **విస్తా కాంప్లెక్సు ఖాళీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **అధికారులతో కలిసి రామాలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవస్థానంఈవో**

**భద్రాచలం, ఆగస్టు 13 (డిడి9 వార్త)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు గురువారం పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఈవో తెలిపారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రామాలయంకు చెందిన వాణిజ్య సముదాయం విస్తా కాంప్లెక్సును త్వరగా వ్యాపారస్తులు ఖాళీ చేసేలా చూడాలని, దీని వలన పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందన్నారు. వ్యాపారులతో ఏమైనా సమస్యలుంటే సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులతో పేర్కొన్నారు. రామాలయం ఉత్తరం వైపు పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నవంబరు నాటికే ఉత్తరద్వారం పూర్తి చేసే ఇచ్చేలా పనులు జరగాలని అన్నారు. ఎటువంటి జాప్యం జరగకుండా, నాణ్యత ప్రమాణాలు లోపించకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్, ఏఈవో శ్రావణ్‌కుమార్, సీసీ అనిల్‌కుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది, నిర్మాణ పనుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి..

- **సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ అమలు చేయాలి**
- **ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ..**



**ఆగస్టు13 డిడి9 వార్త వెంకటాపురం.**

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని కోరారు. గురువారం వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు కేవలం ఉద్యోగుల సమస్యలు మాత్రమే కాకుండా, విద్యారంగానికి సంబంధించిన సమస్యలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ జిల్లా నాయకులు పొడెం సమ్మయ్య, ములుకాల వెంకటస్వామి, కాక సమ్మయ్య, కే. సంతోష్, బి. జయరాం, బి. లక్ష్మయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## అమరేందర్‌కు ఘన సన్మానం

**జన్మదినం సందర్భంగా బుక్క అయ్యవారు సంక్షేమ సంఘం ప్రతినిధుల అభినందనలు**



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**

బుక్క అయ్యవారు సంక్షేమ సంఘం గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో సంఘ మార్గదర్శకులు, శ్రేయోభిలాషి పీ.ఎస్. అమరేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘానికి సంబంధించిన పలు అంశాలు, చిన్నచిన్న సమస్యలపై ప్రతినిధులు చర్చించారు. సంఘ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

## బతుకమ్మకుంటకు భద్రత కల్పించాలి



**జనగామ, ఆగస్టు 13(డిడి 9వార్త )బ్యూరో**

జనగామ పట్టణంలోని బతుకమ్మకుంటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, భద్రతా సిబ్బందిని నియమించాలని కోరుతూ టీఆర్పీ యూత్ జిల్లా అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి కట్ల సదానందం ముదిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బతుకమ్మకుంటలో సీసీ కెమెరాలు లేకపోవడంతో రాత్రివేళల్లో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మద్యం సేవించి ఖాళీ సీసాలు, సిగరెట్ పీకలను పరిసరాల్లో పడేస్తున్నారని వారు తెలిపారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చన్నారు. అదేవిధంగా కుంట పరిసరాల్లో కోతుల బెడదతో చిన్నారులు, వాకర్స్, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్పీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు వంశీ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ బాబా, యామంకి విజయ్, జిల్లా కార్యదర్శి వరికుప్పల గంగరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు వెంపటి అజయ్, పట్టణ సంయుక్త కార్యదర్శి సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

### చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం: శ్రీహరి





**జనగామ ఆగస్టు 13(డిడి 9 వార్త) బ్యూరో**

వర్షాభావ పరిస్థితుల్లో రైతుల పంటలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి గురువారం రైతులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు.

దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లను నింపి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో సాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 14న గండి రామారం, 15న బొమ్మకూరు రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో రెండున్నరేళ్లలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలో రఘునాథపల్లిలో రూ.100 కోట్లతో 220 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు కానుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు,జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల గుడి చందర్ రెడ్డి,మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,లింగాజి బోనాసి క్రాంతి కుమార్, పోకల శ్రీనివాస్ మేడిపల్లి నరేష్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురువు జన్మదిన వేడుకలు.. శిష్యురాలి గురుదక్షిణ

### పేద విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసిన యూట్యూబ్ స్టార్ వర్షిణి



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**

రెయిన్‌బో స్కూల్ అధినేత పి.ఎస్. అమరేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన శిష్యురాలు, యూట్యూబ్ స్టార్ వర్మణి వర్షిణి వినూత్నంగా గురుదక్షిణ సమర్పించారు. సంజయ్‌గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి గురువుపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వర్షిణి ఫోన్ ద్వారా మాట్లాడుతూ.. ఇతర కార్యక్రమాల కారణంగా తాను స్వయంగా హాజరు కాలేకపోతున్నందుకు విచారం వ్యక్తం చేశారు. తన గురువు అమరేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువుకే అత్యున్నత స్థానం ఉంటుందని, గురువును గౌరవిస్తూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం గొప్ప అవకాశమని వర్షిణి పేర్కొన్నారు. గురువు జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సేవ చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దయానంద్, సర్వేశ్ మాస్టర్, వేణుమాధవ్, కిషోర్ తదితరులతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వర్షిణి కృతజ్ఞతలు తెలిపారు.

## కుతాడి.లక్ష్మణరావు కుటుంబానికి పరామర్శ, ఆర్థిక సాయం

- కార్యకర్త కుటుంబానికి నేనున్నాను అని భరోసా ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు...
- 20 ఏళ్లుగా చీకట్లో ఉన్న ఇంటికి వెలుగు తెచ్చిన తాటి
- "రేపటిలోగా కరెంట్ ఇప్పిస్తా.. ఖర్చంతా నేనే భరిస్తా" — మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు





**అశ్వరావుపేట:ఆగస్టు 13(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కూతడి లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరగడంతో, ఆయన నివాసానికి వెళ్లిన బూర్గంపహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. లక్ష్మణరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ తక్షణ సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు సతీమణి తమ కుటుంబం గత 20 సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తాటి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన తాటి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. "విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చును నేనే భరిస్తాను. రేపటిలోగా ఆ ఇంటికి కరెంట్ సౌకర్యం కల్పించాలి" అని అధికారులకు సూచించారు. అలాగే గ్రామస్తులు కూర్చోవడానికి రెండు బల్లలు ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే స్పందించి బల్లలను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

**మామిళ్లవారిగూడెంలో అనారోగ్యంతో ఉన్న కుటుంబానికి పరామర్శ**

అశ్వారావుపేట మండలం మామిళ్లవారిగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న కొడారి మహేశ్వరరావును తాటి వెంకటేశ్వర్లు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసాని పద్మ చంద్రమోహన్, భూక్య ప్రసాద్, మాజీ సర్పంచ్ పొట్ట రాజులు, జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, మాజీ పట్టణ అధ్యక్షులు సంపూర్ణ, మాజీ సర్పంచ్ వేదాంతపురం సంగీత వీర్రాజు, గొడవర్తి వెంకటేశ్వరరావు, తాండ్ర యుగేందర్, మోటూరి మోహన్, తగరం శ్రీను, తగరం హరి, నర్లపాటి చిన్నబ్బాయి, జుజ్జురపు రాంబాబు, నార్లపాటి అనిల్, కోర్స ప్రతాప్, న్యాయవాది ఉదయ్‌తో పాటు నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జక్కుల రాంబాబు, నారం అనురాధ, రాయగిరి వెంకటేశ్వరరావు, అల్లం సీతారాములు, కాండ్రుకొండ శ్రీనివాస్, మల్లేశ్వరరావు, యతిరాజు దుర్గారావు, కౌలూరి నరేష్, కాటూరి నాగు, పల్లెల శ్రీనివాస్, కాటూరి మంగరాజు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్య, భోజనం, వసతులపై ప్రత్యేక దృష్టి..

- గన్నెబోయిన గుంపు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం.

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**



విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం కట్టు మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని గన్నెబోయినగుంపు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే.. వారి చదువు ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన ఎలా ఉంది, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ, పరిశుభ్రత తదితర అంశాలపై ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అవసరమైన భవనాలు నిర్మించడం, నాణ్యమైన భోజనం అందించడం, విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం, మంచి మెనూ అమలు చేయడం, పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలకు అవసరమైన వసతులు, భవనాలు, మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు లేదా బిల్లులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సురక్షితమైన వాతావరణం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.పినపాక నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మరియు టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు మందా సత్యానందానికి ప్రెస్ క్లబ్ సభ్యుల ఘన నివాళులు

### సత్యనందం సేవలు కొనియాడిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**బోనకల్,ఆగస్టు 13, (డీడీ9 వార్త):**

ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందిన విజన్ ఆంధ్ర రిపోర్టర్ మందా సత్యానందం సంస్మరణ సభ గురువారం ఆయన స్వగ్రామమైన గోవిందపురంలో నిర్వహించారు.కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ సభ్యులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై సత్యానందం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి మాట్లాడుతూ చిన్న వయసులోనే మిత్రుడు సత్యానందం మృతి చెందడం తీవ్ర విషాదకరమన్నారు.జర్నలిస్టుగా నిజాయితీగా, ధైర్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యలు,అవినీతిపై తనదైన శైలిలో వార్తలు రాశారని కొనియాడారు. సత్యానందం కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.ప్రెస్ క్లబ్ సభ్యులు,తన తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక భరోసాగా సేకరించిన నగదు ను త్వరలోనే వారి కుటుంబం పేరుమీద జమ చేయనన్నట్టు తెలిపారు.భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు.ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన యుటిఎఫ్ నాయకులు సిపిఎం పార్టీ నాయకులు ఉద్యోగస్తులు, సత్యానందం కుటుంబానికి అండగా సుమారు నాలుగు లక్షల రూపాయలు విరాళాలు సేకరించి వారి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ తేనె వెంకటేశ్వర్లు,వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బడే,ట్రెజరర్ బాజీ షరీఫ్,సభ్యులు మాగి ముఖేష్,షేక్ మదర్ సాహెబ్, పెంటు సాహెబ్,కొణతాలపల్లి నాగేశ్వరరావుకు, బ్రహ్మం,నాగటి రాజశేఖర్,మందా అశోక్, ఇరుగు పుల్లారావు, సుమన్ తదితరులు ఉన్నారు.

## మేరా భారత్ ఆధ్వర్యంలో.. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం..

### పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన..

**మణుగూరు.ఆగస్టు 13 (డి డి 9వార్త)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మిట్టగూడెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా భారత్ (MY Bharat) ఆధ్వర్యంలో, యువత భాగస్వామ్యంతో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువతకు పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. యువత ప్రజా ప్రదేశాల్లో చెత్తను తొలగించడం, తడి–పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలియజేస్తూ.. "స్వచ్ఛమైన భారత్ – ఆరోగ్యమైన భారత్", "నా ఊరు – నా బాధ్యత" వంటి నినాదాలతో అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన పెంపొందించేందుకు "స్వచ్ఛ పక్వాడా" అంశంపై వ్యాసరచన కార్యక్రమం కూడా నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రత, వ్యక్తిగత పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యాసాల రూపంలో వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బండారుపల్లి రవి, NSS PO చిట్టిబాబు, మేరా భారత్ జిల్లా అధికారి రాంబాబు, విద్యార్థులు, ఆదివాసి శక్తి యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు శాపంగా హోల్‌సేల్ మార్కెట్

- **కళాశాల మైదానంలో వాహనాల పార్కింగ్‌తో అవస్థలు.. మార్కెట్‌ను తరలించాలి: డీవైఎఫ్ఐ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**





ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని డీవైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ ఆరోపించారు. మేదర్‌బస్తిలో మార్కెట్ నిర్మాణాలు పూర్తయినందున హోల్‌సేల్ మార్కెట్‌ను వెంటనే అక్కడికి తరలించాలని డిమాండ్ చేశారు. వేసవిలో హోల్‌సేల్ వ్యాపారులకు మౌలిక వసతులు కల్పించేందుకు మార్కెట్‌ను కళాశాల మైదానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారని తెలిపారు. నిర్మాణాలు పూర్తయినా మార్కెట్‌ను తరలించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌కు వచ్చే డీసీఎం వ్యాన్లు, ద్విచక్ర వాహనాలను కళాశాల మైదానంలో ఇష్టారాజ్యంగా నిలుపుతుండటంతో ఉదయం ప్రార్థనా సమావేశాలకు ఆటంకం కలుగుతోందన్నారు. సాయంత్రం వేళ కళాశాల మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఆరోపించారు. వైన్స్‌షాప్ పర్మిట్ రూమ్ కారణంగా మహిళలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. మైదానంలో కనిపిస్తున్న మద్యం సీసాలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ కళాశాల స్థలంలో వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారో అధికారులు వెల్లడించాలని కొంటు సాగర్ డిమాండ్ చేశారు. నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి కళాశాల బ్లూప్రింట్‌ను ప్రజలకు బహిర్గతం చేయాలని కోరారు. దుకాణాల సముదాయానికి విద్యాశాఖ నుంచి పొందిన జీవో, అనుమతి ఉత్తర్వుల ప్రతులను కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

# జీడీకే-2 ఇంక్లైన్ లో 'సురక్షిత తిరంగా' సైబర్ అవగాహన కార్యక్రమం

- **సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.. 1930కు ఫిర్యాదు చేయాలి: ఎస్ ఐ మారుతి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**




జీఎం ఆర్‌జీ-1 డి. లలిత్ కుమార్ ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ సబ్ఇన్‌స్పెక్టర్ మారుతి ఆధ్వర్యంలో గురువారం జీడీకే-2 అండ్ 2ఏ ఇంక్లైన్‌లోని జీడీకే-2 సెక్షన్‌లో 'సురక్షిత తిరంగా' సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మారుతి సైబర్ నేరాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా సంబంధిత ఖాతాలను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని, ఆలస్యం జరిగితే నగదు రికవరీ కష్టతరమవుతుందని తెలిపారు. వాట్సాప్ తదితర మాధ్యమాల్లో పోలీసులమంటూ బెదిరింపు కాల్స్ వస్తే భయపడవద్దని, అలాంటి కాల్స్‌ను వెంటనే కట్ చేసి సమీప సైబర్ క్రైమ్ బృందానికి సమాచారం అందించాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, యాప్‌లు, . ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయకుండా వెంటనే డిలీట్ చేయాలని, గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయకూడదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లింకుల ద్వారా ఓటీపీ నమోదు చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాన్, ఆధార్ తదితర వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అలాగే ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలపై కూడా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు చెప్పే అధిక లాభాల పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, డి. గణేష్ వెల్ఫేర్ ఆఫీసర్, సల్మాన్ ఖాన్ సెక్షన్ ఇన్‌చార్జి, జి. కుమారస్వామి వెంటిలేషన్ ఆఫీసర్, గని అధికారులు, పొన్నాల వెంకటయ్య పిట్ సెక్రటరీ, సూపర్‌వైజర్లు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన అంబులెన్స్ ప్రారంభం

- **ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు.. పేదలకు అత్యవసర వైద్య సేవల్లో మరింత సౌలభ్యం**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**





ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో సమకూర్చిన నూతన అంబులెన్స్‌ను గురువారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రికి నూతన అంబులెన్స్ అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించడంలో అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో అంబులెన్స్‌ను సమకూర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, అత్యవసర సేవలను మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేస్తామని అన్నారు. నూతన అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులను వేగంగా ఆస్పత్రికి తరలించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా అంబులెన్స్‌ను డ్రైవింగ్ చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, స్థానిక కార్పొరేటర్ సాగి సంతోష్ రావు, ఆస్పత్రి అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌టీపీసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోవింద్‌పేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం : ఇద్దరు మహిళల దుర్మరణం

- **నిలిపిన టూరిస్ట్ బస్సును ఢీకొట్టిన లారీ**
- **ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా, జూలై 13(డీడీ9 వార్త) :**






ఆధ్యాత్మిక యాత్ర కోసం బయలుదేరిన భక్తులను ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళా భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తుల బృందం హైదరాబాద్‌లోని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి దర్శనార్థం రెండు టూరిస్ట్ బస్సుల్లో బయలుదేరింది. మార్గమధ్యలో ఆర్మూర్ సమీపంలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న బస్సు టైర్ పంచర్ అయింది. దీంతో డ్రైవర్లు రెండు బస్సులను జాతీయ రహదారి పక్కనే నిలిపివేశారు. ప్రయాణ అలసట వల్ల బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందకు దిగి, రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ డ్రైవర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును గమనించకపోవడంతో బలంగా ఢీకొట్టాడు. లారీ తాకిడి తీవ్రతకు ఆగి ఉన్న బస్సు ఒక్కసారిగా ముందుకు జరిగి, డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన సుజాత (54), మాధవి (47) అనే ఇద్దరు మహిళలు శరీరం ఛిద్రమై తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత, చిటక్కలకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రమాద శబ్దం, క్షతగాత్రుల ఆర్తనాదాలతో ప్రాంతమంతా తీవ్ర భయాందోళనకర వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదం జరిగిన తీరు, వాహనాలు నిలిపి ఉంచిన విధానం, లారీ అతివేగం తదితర వివరాలను స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై వాహనాలు నిలిపివేసే సమయంలో ప్రమాద హెచ్చరిక లైట్లు ఆన్ చేయడంతో పాటు తగిన దూరంలో సూచికలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రయాణికులు రోడ్డు డివైడర్లపై కూర్చోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. సీపీ వెంట ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్ఓ సత్యనారాయణ, ఎంవీఐ రాహుల్ కుమార్, మరియు బాల్కొండ, జక్రాన్‌పల్లి ఎస్సైలు ఉన్నారు.

# చేయూత పెన్షన్ కు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- **వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత– కల్లుగీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులకు అవకాశం**



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 13 (డీడీ9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం 13-08-2026న 48వ డివిజన్‌లో నిర్వహించారు. గౌరవ రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గారి ఆదేశాల మేరకు, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి గారి సూచనలతో డివిజన్‌లో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, డయాలసిస్ రోగులు, ఫైలేరియా బాధితులు తదితర అర్హులైన వారు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు సమర్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి సూచించారు.

# బుచ్చంపేటలో ఘనంగా బోనాల పండుగ

**డప్పు కళాకారులకు ఆర్థిక సహాయం అందించిన బీఆర్ ఎస్ జిల్లా నాయకులు చిట్టి మల్ల సమ్మయ్య**



**మంగపేట,ఆగస్టు 13డీడీ9 వార్త**

మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకుని గ్రామంలో పండుగ సందడి నెలకొంది. బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే సాంప్రదాయ కార్యక్రమాల్లో డప్పు కళాకారుల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు, బుచ్చంపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారులకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు చిట్టి మల్ల సమ్మయ్య ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న డప్పు కళను కాపాడుతూ, పండుగలు, జాతరలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ కళను ప్రదర్శిస్తున్న డప్పు కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కళాకారులకు అండగా నిలవడం ద్వారా సంప్రదాయ కళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. బుచ్చంపేట గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా డప్పు కళాకారులకు ఆర్థిక సహాయం అందించడం పట్ల గ్రామస్తులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. తమను గుర్తించి ప్రోత్సహించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారికి, ఆర్థిక సహాయం అందించిన చిట్టి మల్ల సమ్మయ్య కి డప్పు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. బోనాల పండుగను పురస్కరించుకుని గ్రామంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు కొనసాగగా, డప్పు కళాకారుల వాయిద్యాలతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.

# ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**నిజామాబాద్ జిల్లా, జూలై 13(డీడీ9 వార్త) :**



రాష్ట్రంలో విద్యా రంగాన్ని, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో భీమ్‌గల్‌లో గురువారం నిరసన ప్రదర్శన హోరెత్తింది. పాఠశాలల వేళల్లోనే నిరంతర శిక్షణలు, ఆన్‌లైన్ పనుల పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం తహసిల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 01.07.2023 నుండి అమలు చేయడంలో పద్ధతి లేదని, ప్రభుత్వం నుంచి రావాల్సిన 6 విడతల డీఏలు పెండింగ్‌లో పెట్టడం దారుణమని నాయకులు విమర్శించారు. 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ ఆప్షన్ ఇవ్వడంతో పాటు సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 27 వేల బడులను 4 వేలకు కుదించి మూసివేసే ఆలోచనలను సర్కారు విరమించుకోవాలని, జీవో 25ను సవరించి ప్రతి బడికి కనీసం ఇద్దరు టీచర్లను ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను ఆగస్టు 15 లోపు విడుదల చేయాలని ప్రశ్నించారు. జీవో 317 బాధితులను సొంత జిల్లాలకు పంపాలని, కేజీబీవీ, సమగ్రశిక్ష కాంట్రాక్ట్ సిబ్బందికి మినిమం బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో వేలాది మందితో మహా నిరసన ప్రదర్శనలు చేపడతామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల వేళ "ఛలో అసెంబ్లీ" నిర్వహించి తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఈశ్వర్, లింగయ్య, జనార్దన్, రమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో విలసిల్లేది శ్రావణ మాసమే

**నిజామాబాద్ జిల్లా, జూలై 13(డీడీ9 వార్త) :**



పవిత్రమైన ఆధ్యాత్మిక శోభను, సకల ఐశ్వర్యాలను ప్రసాదించే శక్తి శ్రావణ మాసానికి ఉందని రాఘవేంద్ర స్వామి తెలిపారు. బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ శివారులోని అవధూత బ్రహ్మ, కుండలిని జ్ఞాన యోగి శ్రీ శ్రీ శ్రీ గోవింద గిరి స్వామి దివ్య యోగాశ్రమంలో శ్రావణ మాసం తొలి గురువారాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ అర్చకులు జన్మంచి ప్రవీణ్ కుమార్ పంతులు ఆశ్రమంలోని దేవతామూర్తులకు దివ్య పూజలు నిర్వహించగా, ధ్యాన మందిరం భక్తుల సామూహిక భజనలతో మారుమోగింది. గోవింద గిరి స్వామి శిష్యుడైన రాఘవేంద్ర స్వామి శ్రీ సాయిబాబా ఆలయంలో భక్తులకు శ్రావణ మాస ప్రాశస్త్యాన్ని వివరించారు. పూజలు, వ్రతాలకు నిలయమైన ఈ మాసంలో లక్ష్మీనారాయణులతో పాటు ముక్కంటిని ఆరాధిస్తే విశేష పుణ్యఫలాలు దక్కుతాయని చెప్పారు. సాయంత్రాల్లో లక్ష్మీదేవి సమక్షంలో దీపారాధన చేసి, లక్ష్మి అష్టోత్తరం లేదా విష్ణు సహస్రనామ పారాయణం చేయడం, శివాలయంలో అభిషేకాలు జరిపించడం ఉత్తమ ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. పూజానంతరం స్వామివారి పల్లకి సేవను కంటికింపగా నిర్వహించి, వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో ఉచిత నోట్ బుక్ ల పంపిణీ



**బాన్సువాడ, ఆగస్టు 13(డిడి9 వార్త):**

తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఉచిత నోట్‌బుక్‌లను అందిస్తోంది. ఇందులో భాగంగా బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ మామిళ్ల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ ప్రథమ పౌరుడు, సర్పంచ్ అరిగే ధర్మతేజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠాలను నోట్ చేసుకోవడానికి ఈ ఉచిత పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు విఠల్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, అధ్యాపకులు సత్తన్న, దేవిసింగ్, సతీష్, సౌమ్య, నాగరాజ్, బాలకిషన్, రాకేష్, సుభాష్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాగుల చవితి వేడుకలకు ఆలయ ప్రాంగణం పరిశుభ్రం



**బాన్సువాడ, ఆగస్టు 13(డిడి9 వార్త):**

బీర్కూరు మండల కేంద్రంలో సోమవారం జరగనున్న నాగుల చవితి పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అరిగే ధర్మతేజ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణానికి రంగులు వేయించారు.ప్రతి సంవత్సరం నాగుల చవితి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ, పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్ అరిగే ధర్మతేజ చొరవ తీసుకుని ఆలయ పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శేఖర్ యాదవ్, యమ చిన్న రాములు, ప్రభాకర్ యాదవ్, నారం పిరన్న, గాండ్ల లక్ష్మణ్, టెంట్ హౌస్ రాజు, నరేంద్ర గౌడ్, శివాజీ, తోట్ల సాయిలు, యమ హన్మంతు, పోతుల సాయిలు, కాజా పాల్గొన్నారు.

## ఒకే రోజు రెండు ఇసుక వాహనాల పట్టువేత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**

సాలూర మండల పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు వాహనాలను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారని తహసీల్దార్ అజ్మత్ నవాజ్ తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ వాహనాలు దొరికినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఖాజాపూర్ మంజీరా నదీ శివారు ప్రాంతం నుంచి బోధన్ వైపు ప్యాసింజర్ ఆటోలో సంచుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సాలూర క్యాంప్ వద్ద రెవెన్యూ ఉద్యోగి సంజీవ్ గురువారం ఉదయం నిఘా ఉంచి పట్టుకున్నారు. అలాగే సాయంత్రం వేళ ఖాజాపూర్ వద్ద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఒక టాటా మ్యాజిక్ ఆటో దొరికింది. దీంతో అధికారులు ఈ రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీరా నదీ తీరం నుంచి ఇసుకను తోడి అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు. మండల పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# నల్లబెల్లం, పటిక అక్రమ రవాణాపై ఎక్సైజ్ దాడులు

- **220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటిక స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 13(డిడి9 వార్త):**



నాటుసారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని కామారెడ్డి ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి భారీగా నల్లబెల్లం, పటికతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది నమ్మదగిన సమాచారం ఆధారంగా సిరిసిల్ల రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ఇండికా కారును తనిఖీ చేయగా అందులో 60 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటిక లభించింది. దీంతో వీర్నపల్లి గ్రామానికి చెందిన భూక్య గంగాను అదుపులోకి తీసుకుని, ఏపీ 28 సీడీ 3397 నంబర్ గల కారును స్వాధీనం చేసుకున్నారు.అనంతరం భూక్య గంగా ఇచ్చిన సమాచారంతో కామారెడ్డి గంజి మార్కెట్‌లోని కృష్ణ కుమార్ మార్వెంటి వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ 160 కిలోల నల్లబెల్లం, 54 కిలోల పటిక లభించడంతో కృష్ణ కుమార్‌ను కూడా అరెస్ట్ చేశారు.ఈ రెండు దాడుల్లో కలిపి 220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటికతో పాటు ఒక కారును ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.నాటుసారా తయారీకి పాల్పడినా, నాటుసారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. ముకుంద్ రెడ్డి హెచ్చరించారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, ఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ జాన్‌తో పాటు సిబ్బంది గోరి, పవన్‌కుమార్, రాజు, బాబు, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హల్ద్వానీ ఘటనకు నిరసనగా ఆగస్టు 14న కామారెడ్డిలో పాదయాత్ర

- **రాజ్యాంగ విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం: ఏలే మల్లికార్జున్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 13(డిడి9 వార్త):**

హల్ద్వానీలో కాంగ్రెస్ ర్యాలీ జరిగిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధీకరణ చేసిన ఘటనను నిరసిస్తూ ఆగస్టు 14న కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పాదయాత్ర, సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తెలిపారు.ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు సంఘీభావంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ లేదా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి అనంతరం




సత్యాగ్రహం చేపట్టనున్నట్లు తెలిపారు. వివక్ష, అంటరానితనం వంటి చర్యలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ విలువలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం వంటి రాజ్యాంగ విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఏలే మల్లికార్జున్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# డ్రగ్స్, సైబర్ నేరాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

- **ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులతో సీపీ సాయి చైతన్య నేర సమీక్షా సమావేశం**

**నిజామాబాద్ జిల్లా, జూలై 13(డీడీ9 వార్త) :**



రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం ఇస్తున్న పిలుపు మేరకు పోలీస్ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ ఆర్మూర్ డివిజన్ పరిధిలోని కేసుల పురోగతిపై నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర డిజిపి ఆదేశాలకు అనుగుణంగా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమార్కులపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ మోసాల అరికట్టేందుకు సైబర్ అవగాహన సదస్సులు పెంచాలని, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై నిఘా పెట్టాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసుల ఫైళ్లను పరిశీలించిన సీపీ, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలను రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల వద్ద నిరంతరం మోహరింపజేస్తున్నట్లు తెలిపారు. గుట్కా, పేకాట, అక్రమ ఇసుక తవ్వకాలపై నిరంతర దాడులు జరపాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడుకుంటూ సీసీ కెమెరాల నెట్‌వర్క్‌ను పెంచాలని సూచించారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు వెల్లడించారు. రహదారి భద్రతపై పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోందని సీపీ వివరించారు. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం, రోడ్డు అంచున ఉన్న పొదలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. నేషనల్, స్టేట్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుంటూ రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, మైనర్ డ్రైవర్లపై రోజువారీ తనిఖీలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 112 వినియోగంపై ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే పండుగల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం 24 గంటల పటిష్ట బందోబస్తు, వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, వివిధ పోలీసు స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సర్కారు బడికి అండగా విద్యాదాత ఏనుగు దయానంద రెడ్డి

- **రూ. 2 లక్షల విలువైన 45 బెంచీల విరాళం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**



ప్రభుత్వ బడిలో చదివే పేద విద్యార్థుల ముఖాల్లో నవ్వులు పూయించేందుకు ఓ పారిశ్రామికవేత్త తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం బాల్కొండ నియోజకవర్గం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వసంత్ టూల్స్ అధినేత ఏనుగు దయానంద రెడ్డి రూ.2 లక్షల విలువైన 45 డ్యూయల్ డెస్క్ బెంచీలను విరాళంగా ఇచ్చి తమ పెద్ద మనసును చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవికుమార్ విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన ఆయన విద్యార్థులు కింద కూర్చుని పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ సహాయం అందించారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ కందగట్ల రామచందర్, రెడ్ క్రాస్ సొసైటీ మండల ప్రెసిడెంట్ మల్లెపూల శ్రీనివాస్, వార్డు మెంబర్ గంగారెడ్డి తదితరుల సమక్షంలో ఈ బెంచీలను ప్రారంభించారు. దాత అందిస్తున్న ఈ సహకారం విద్యార్థుల చదువుకు ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి తోడ్పడిన దాత ఏనుగు దయానంద రెడ్డికి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జాబ్ ఫ్రాడ్‌లో దంపతులపై కేసు నమోదు,మహిళ అరెస్ట్

- **కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.18.50 లక్షలు మోసం చేసిన నిందితులు.**
- **బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితురాలని అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టిన ఇచ్చోడ పోలీసులు.**
- **ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

ఇచ్చోడ మండలం కామగిరి గ్రామానికి చెందిన నక్కల రమణారెడ్డి ఫిర్యాదు మేరకు మోసం చేసిన దంపతులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఫిర్యాదుదారుడి సోదరుడు రాజశేఖర్‌రెడ్డికి పరిచయమైన A1 ఉప్పాడి @ ఉమ్మడి శంకర్ (49), వారి కుమారులకు కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల చొప్పున డబ్బులు ఇవ్వాలని కోరాడు. దీంతో బాధితులు విడతల వారీగా మొత్తం రూ.18.50 లక్షలు ఉప్పాడి శంకర్,



అతని భార్య ★A2 ఉప్పాడి @ ఉమ్మెడ లావణ్య (40)★కు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగాలు ఇప్పించలేకపోయామని, మొత్తం డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి కేవలం రూ.1 లక్ష మాత్రమే తిరిగి చెల్లించి, మిగిలిన రూ.17.50 లక్షలు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో A2 ఉప్పాడి @ ఉమ్మెడ లావణ్య (40), W/o ఉమ్మెడ శంకర్, నివాసం: జీడిమెట్ల, హైదరాబాద్ అనే నిందితురాలని ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించవద్దని, మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్ సూచించారు.

# సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

- **డిఎంహెచ్‌వో డాక్టర్ బి.రాజశ్రీ**
- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వ్యాధులు, టీకాలపై సమీక్షా సమావేశం**

**నిజామాబాద్ జిల్లా, జూలై 13(డీడీ9 వార్త) :**

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, జీవనశైలి వ్యాధులు, క్షయ వ్యాధి మరియు వ్యాధి నిరోధక టీకాల అమలుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి ట్యాంకులను వారానికి ఒకసారి తప్పకుండా శుభ్రం చేయాలని, ప్రతిరోజూ బ్లీచింగ్ పౌడర్ కలిపిన క్లోరినేషన్ నీటినే తాగునీరుగా వినియోగించేలా చూడాలన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడటంతో పాటు ఖాళీ ప్లాట్లు, మురికినీటి గుంటల్లో ఆయిల్ బాల్స్‌ను వదలాలని సూచించారు. డెంగీ వ్యాధి నమోదైన ప్రాంతాల్లో ఆ ఇంటి చుట్టూ ఉన్న 50 ఇళ్లలో పైరత్రమ్ స్ప్రే, 100 ఇళ్ల పరిధిలో టెమిపాస్ స్ప్రే చేయాలని స్పష్టం చేశారు. ఇంటింటికీ జ్వరం సర్వే నిర్వహించి, అవసరమైన చోట ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ రక్త పరీక్షలు జరపాలన్నారు. డెంగీ సోకిన రోగులు ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకుంటూ పారాసీటమాల్ మాత్రలు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రై డే' పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నీటి పరీక్ష కిట్లను ఉపయోగించి తాగునీటి నాణ్యతను పరీక్షించడం ద్వారా టైఫాయిడ్,



డయేరియా, కాలరా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. క్షయ నిర్ధారణ పరీక్షల సేవలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలని, టీబీ బాధితులు తప్పనిసరిగా ఆరు నెలల చికిత్సా కోర్సును పూర్తి చేయాలని పేర్కొన్నారు. జీవనశైలి వ్యాధుల నియంత్రణలో భాగంగా 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ హైపర్ టెన్షన్, మధుమేహం, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, పెండింగ్ వివరాలను ఎం–లాగిన్ పోర్టల్‌లో నమోద చేయాలని ఆదేశించారు. టీకాల ద్వారా నియంత్రించగల వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని, అనుమానిత ఏఎఫ్‌పీ, మీజిల్స్ శాంపిల్స్ సేకరించి పంపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిటిసిఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, పివో డిటి డాక్టర్ అంజన, డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, హెచ్ఈఈవో జహీద్, డిప్యూటీ డెమో దుర్గారావు, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాకోర, శంకోరలో అభివృద్ధి పనులకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీకారం

- **గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం – మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 13(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం జాకోర, శంకోర గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలను తన చేతుల మీదుగా ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. జాకోర గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం అందుబాటులోకి రావడంతో గ్రామంలోని



మహిళలకు సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలగనుంది.గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు.అనంతరం జాకోర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పీఏసీఎస్‌కు సంబంధించిన కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన ఈ సముదాయం గ్రామ ప్రజలకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

**శంకోరలో నూతన పంచాయతీ భవనం ప్రారంభం**

శంకోర గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.నూతన భవనం అందుబాటులోకి రావడంతో గ్రామ పంచాయతీ పరిపాలనా కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలగనుంది.గ్రామ ప్రజలు తమ సమస్యలను పంచాయతీ స్థాయిలో పరిష్కరించుకునేందుకు, వివిధ ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఈ భవనం ఉపయోగపడనుంది.గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘ భవనాలు, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన వసతులను దశలవారీగా కల్పిస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**అభివృద్ధి పనులతో గ్రామాలకు కొత్త రూపు**

జాకోర, శంకోర గ్రామాల్లో ఒకేరోజు పలు అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.మహిళా సంఘ భవనం, పీఏసీఎస్ దుకాణ సముదాయం, ప్రహరీ గోడ, గ్రామ పంచాయతీ భవనం వంటి నిర్మాణాలు పూర్తవడంతో గ్రామ ప్రజలకు వివిధ రకాలుగా ప్రయోజనం కలగనుంది.ప్రభుత్వ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ గ్రామాల్లో శాశ్వత మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని నాయకులు తెలిపారు.గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో బోధన్ ఆర్డీఓ విజయకుమారి, వర్ని మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, పీఏసీఎస్ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం ప్రాణదానంతో సమానం

- **బోధన్ ఆర్డీఓ ఎం.విజయకుమారి**
- **దాతల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం, అధికారిక లాంఛనాలు కల్పించాలి: డాక్టర్ కాట్రగడ్డ భారతి**
- **విద్యా వికాస్ కళాశాలలో ప్రపంచ అవయవ దాన అవగాహన సదస్సు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**

మరణానంతరం చేసే అవయవ దానం మరొకరి జీవితంలో నూతన కాంతులు నింపుతుందని, ఒక్క వ్యక్తి చేసే అవయవ దానంతో దాదాపు ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని బోధన్ ఆర్డీఓ ఎం.విజయకుమారి పేర్కొన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బోధన్‌లోని విద్యా వికాస్ కళాశాల ప్రాంగణంలో లయన్స్ క్లబ్ భవానీ, బోధన్, తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ ఎం.విజయ కుమారి మాట్లాడుతూ... సమాజంలో అవయవ దానంపై ఉన్న మూఢనమ్మకాలు, అపోహలను వీడాల్సిన అవసరం ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు అమర్చడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి అవయవ దానానికి ముందుకు రావాలని, కుటుంబ సభ్యుల్లోనూ దీనిపై స్పృహ పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు, లయన్ డాక్టర్ కాట్రగడ్డ భారతి



మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా అవయవ దానంపై నిరంతర చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఆగస్టు 3 జాతీయ శరీర అవయవ దాతల దినోత్సవం నుంచి ఆగస్టు 13 ప్రపంచ అవయవ దాన దినోత్సవం వరకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, వైద్య విద్యాలయాల్లో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అవయవ దానం, రక్త దానం, నేత్ర దానం మరియు శరీర దానం అనే నాలుగు మహా దానాల విశిష్టతను వివరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం ముందు పలు కీలక డిమాండ్లను ఉంచారు. బ్రెయిన్ డెడ్ అయి అవయవ దానం చేసిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని, సైనికులతో సమానంగా అవయవ దాతల అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ పండుగల రోజుల్లో దాతల కుటుంబాలను సత్కరించాలని, జీవో 124పై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ వేడుకల సందర్భంగా అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార పోస్టర్లతో పాటు సావిత్రిబాయి పూలే వార్షిక కాలమానాన్ని ఆవిష్కరించారు.

# దేశాభివృద్ధిలో భాగస్వామ్యమవ్వడమే నిజమైన దేశభక్తి

- **డీహెచ్ఈడబ్ల్యూ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ స్వప్న**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**

ప్రతి పౌరుడు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా' పిలుపును విజయవంతం చేయాలని, దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ స్వప్న పేర్కొన్నారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలోని సాలూర మండల కేంద్రంతో పాటు బోధన్ మండల పరిధిలోని బండారుపల్లి, పెద్ద మావంది గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామ సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండా ప్రాధాన్యతను, స్వాతంత్ర్య సమరయోధుల మహోన్నత త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ.. జాతీయ జెండా పట్ల ప్రతి ఒక్కరూ నిష్ఠను, గౌరవాన్ని చాటాలని కోరారు. అనంతరం సూపర్‌వైజర్ గోపీలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ ఐక్యత మరియు బాధ్యతాయుత పౌరసత్వ భావనలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టులు సౌమ్య, కవిత, అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, సవిత, వీఓ అధ్యక్షురాలు గంగమణి, మండల సమైక్య అధ్యక్షురాలు జ్యోతి, సాలూర మండల భాజపా నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు : జిల్లా అదనపు కలెక్టర్

- **బోధన్ మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీ**
- **పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పామూరు సురేష్ ఆదేశించారు. గురువారం బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులను, రికార్డుల నిర్వహణను మరియు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోధన్ పట్టణంలోని వివిధ వార్డుల్లో సాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత మరియు ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందుతున్న సేవల తీరుతెన్నులపై మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్‌తో ప్రత్యేకంగా సమీక్షించారు. వార్డుల వారీగా ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి పాలకవర్గం, యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం పక్కాగా జరగాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తదనంతరం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలోని సమస్యలు, పెండింగ్ పనులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సేవలందించడంలో పారదర్శకత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి: బోధన్ డిఎల్పీఓ నాగరాజు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**



వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుకోవాలని బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. ఎడపల్లి మండలం అంబం (వై) గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ గోపరి స్రవంతి సుమన్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బోధన్ డిఎల్పీఓ నాగరాజు మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే భూగర్భ జలాలను పెంచుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధుల రూపంలో మంజూరు చేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్ల వద్ద గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సాంప్రదాయ వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపితే అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. నిరంతరం ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి పద్ధతులను పాటించడం వల్ల భూసారం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిఎల్పీఓ సూచించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఇంట్లో వంట పాత్రలపై, తాగునీటి పాత్రలపై తప్పనిసరిగా మూతలు ఉంచాలని హెచ్చరించారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఎలాంటి అంటువ్యాధులు మరియు సీజనల్ రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని గుర్తుచేశారు. ఈ గ్రామసభలో సర్పంచ్ గోపరి స్రవంతి సుమన్, ఉప సర్పంచ్ కాకయ్య, పంచాయతీ కార్యదర్శి నిఖిత, బిల్ కలెక్టర్ కిషన్, వార్డు సభ్యులు అశోక్, సంజీవ్, నాగరాజు, అనురాధ, కావేరి, సంతోషిలతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్‌సీడీ, ఆభా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 13(డీడీ9 వార్త) :**

ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌సీడీ, ఆభా ఆరోగ్య ఖాతా సేవలను వార్డు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ ముషీర్ బాబా పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని 34వ వార్డులో జరుగుతున్న ఎన్‌సీడీ, ఆభాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని కౌన్సిలర్ ముషీర్ బాబా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ... మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నామని తెలిపారు. ఆభా ఖాతాను ఏర్పాటు చేసుకోవడం ద్వారా రోగుల ఆరోగ్య వివరాలన్నీ డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత వైద్య సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518